సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



మహిమ కోసం మరియతల్లిని ఆహ్వానిద్దాం

మన జీవితంలో మహిమలు జరిగేందుకు మరియతల్లిని ఆహ్వానిద్దామని ఫాదర్ ముళ్లపాటి వరప్రసాద్ అన్నారు. -8లో..



గుర్తు కొస్తున్నాయి.. ఆనాటి మధుర జ్ఞాపకాలు

కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు అన్నమయ్య జిల్లా కురబలకోటతో అనుబంధం ఉంది. సీతామాలక్ష్మి సినిమాను ఇక్కడే తీశారు. -8లో..

గరిష్టం/కనిష్టం
31.9/16.3

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 16.3 – 31.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

పేదలకు పెద్ద చదువులు

- జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం పేద విద్యార్థులకు వరం
- జేసీ సాయికాంత్‌వర్మ
- జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో మొదటి విడతగా అర్హత పొందిన ఐదుగురికి రూ. 68.03 లక్షలు విడుదల



మెగా చెక్కును అందజేస్తున్న జేసీ, డీఆర్వో, ఇతర అధికారులు

కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విదేవీ విద్యా దీవెనతో పేద విద్యార్థులకు విదేశీ విద్య అందడంతోపాటు ఆంధ్ర రాష్ట్ర విద్యా కీర్తి పతాకాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించనున్నాయని జాయింట్ కలెక్టర్ సీఎం సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి లబ్ధి మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జేసీ సాయికాంత్‌వర్మ, సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్యలు హాజరయ్యారు.

మెగా చెక్కు అందజేత: ముఖ్యమంత్రి వీసీ ముగిసిన అనంతరం జిల్లాకు సంబంధించిన అర్హులైన 12 మంది విద్యార్థుల్లో మొదటి విడతగా ఐదుగురు విద్యార్థులకు మంజూరైన జగనన్న విదేశీ విద్యా దీవెన లబ్ధి మొత్తం రూ. 63,03,638ల మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు గౌరవ అతిథులతో కలిసి జేసీ అందజేశారు.

విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలి

అనంతరం జేసీ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని విదేశీ విద్యకు కూడా అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. నిరుపేద విద్యార్థులకు సైతం విదేశాల్లో ఉన్నత చదువులు చదివే అవకాశం ప్రభుత్వం కల్పించినందుకు లబ్ధిపొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన సాయం అందుకుని చదువుపై ఏకాగ్రతతో భవిష్యత్తు లక్ష్యం వైపు అడుగులు వేయాలని జేసీ ఆకాంక్షించారు. విద్యా రంగానికి సమున్నత స్థానాన్ని ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల సంక్షేమానికి విప్లవాత్మక మార్పులను కూడా చేపట్టారన్నారు. 2022-23 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాన్ని కల్పించారన్నారు.

నిబంధనల మేరకు అర్హుల ఎంపిక

ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాకు చెందిన విద్యార్థులు వారికి ఇష్టమైన యూనివర్శిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలని, తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షల్లోపు కలిగిన విద్యార్థులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలా వచ్చిన దరఖాస్తులను విజయవాడలో అత్యున్నత అధికారులతో కూడిన కమిటీ సభ్యులు పరిశీలిస్తారన్నారు. నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి ప్రభుత్వం ఒక విద్యార్థికి రూ. 70 లక్షల వరకు నాలుగు విడతలుగా నిధులను విడుదల చేస్తుందన్నారు. ఈ పథకానికి జిల్లా నుంచి మొత్తం 32 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో ఓసీ వర్గాలకు చెందిన వారు ఏడుగురు, ముగ్గురు ఈబీసీ, ఒకరు మైనార్టీ, ఒకరు ఎస్సీ వర్గానికి చెందిన వారు కలిపి మొత్తం 12 మంది ఎంపికయ్యారన్నారు. వీరిలో ప్రస్తుతం ఐదుగురికి నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ పథకం లబ్ధిపొందడంలో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఎదురైతే సంబంధిత సంక్షేమశాఖల జిల్లా అధికారికిగానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వ కాల్ సెంటర్ నెంబరు 1902కు కాల్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ, మైనార్టీ, బీసీ సంక్షేమశాఖల అధికారులు, విద్యాశాఖాధికారులు, విదేశాల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

దేవుడిచ్చిన వరం



మాది ప్రొద్దుటూరు. స్పోర్ట్స్ షాపులో జీతానికి పనిచేస్తున్నాను. జీతం వస్తేగానీ కుటుంబం గడవని పరిస్థితి. మా కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి విదేశాల్లో చదవాలని పట్టుబట్టాడు. అతన్ని చదివించే స్తోమత నాకు లేదు. అలాంటి సమయంలో జగనన్న విదేశీ విద్యా దీవెన దేవుడిచ్చిన వరంగా మారింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ కోర్సులో మొదటి సంవత్సరం చేరి యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్ (సిడ్నీ)లో చదువుతున్నాడు. మొత్తం రూ. 54.63 లక్షలు మంజూరైంది. మొదటి విడతగా రూ. 13.65 లక్షలు నా కుమారుడి ఖాతాలో జమ అయింది.

– వీరశేఖర్‌రెడ్డి (విద్యార్థి తండ్రి), ఈబీసీ కోటా, లింగారెడ్డికొట్టాల, ప్రొద్దుటూరు

కల నెరవేరింది



నాది రైతు కుటుంబం. మా లాంటి వారికి ఉన్నత చదువులు చదువుకోవడం సాధ్యమయ్యే పనికాదు. విదేశీల్లో అసలే సాధ్యం కాదు. ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అలాంటిది ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన విద్యా దీవెనతో నా కల నెరవేరింది. ప్రస్తుతం ఈ పథకం కింద ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లోని మోనాస్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ బ్యాంకింగ్ అఫ్ ఫైనాన్స్‌లో చేరేందుకు అవకాశం వచ్చింది. నాకు రూ. 52 లక్షలు మంజూరు కాగా మొదటి విడతగా రూ. 13.11 లక్షలు విడుదలైంది. ఇలాంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– చిలేకాంపల్లె కొండారెడ్డి, విద్యార్థి, ఈబీసీ కోటా, చెంచయ్యగారిపల్లె, బి.మఠం

కలలో కూడా ఊహించలేదు



నా కుమారునికి విదేశాల్లో చదివే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. మాది పేద కుటుంబం. మా అబ్బాయిని విదేశాల్లో చదివించే స్తోమత కూడా నాకు లేదు. ఇలాంటి తరుణంలో జగనన్న విదేశీ విద్యా దీవెన వరంగా పరిణమించింది. నా కుమారుడు సల్మాన్ లండన్‌లోని మాంచెస్టర్‌లో చదివే అవకాశం వచ్చింది. రూ. 29 లక్షలు మంజూరైంది. మొదటి విడతగా రూ. 7.80 లక్షలు విడుదలైంది. ఇలాంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఎప్పటికీ ఉంటే పేదలకు మేలు జరుగుతుంది.

– కె.షహనాజ్ (విద్యార్థి తల్లి), కడప

క్రమశిక్షణ,కష్టపడే మనస్తత్వంతోనే
బంగారు భవిష్యత్తు

- మన విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడాలి
- ప్రభుత్వ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి



ముద్దనూరు: తాను చదువుకున్న తరగతి గదిలో కూర్చుని సంతోషిస్తున్న ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి

ముద్దనూరు: క్రమశిక్షణ,కష్టపడే మనస్తత్వం కలిగిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ,ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎవరికీ తక్కువకాదని ప్రభుత్వ సీఎస్, ముద్దనూరు జెడ్పీ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థి కేఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజుతో కలిసి సీఎస్ తాను చదువుకున్న పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సరిగ్గా 50సంత్సరాల క్రితం తాను ముద్దనూరు స్టేషన్ ప్రాథమిక పాఠశాల,జెడ్పీ హైస్కూల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఐఏఎస్ సాధించినట్లు చెప్పారు.అప్పట్లో పాఠశాలలో ఇప్పుడున్న వసతులు లేవన్నారు. ప్రపంచ స్థాయిలో మన రాష్ట్ర విద్యార్థులు పోటీపడాలని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.600 కోట్ల వ్యయంచేసి ట్యాబ్‌ల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బోధన అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు.విద్యార్థులు తెల్లవారుజామున నిద్రలేవడం,నచ్చిన ఆటలు ఆడడం,తరగతులకు గైర్హాజరుకాకుండా ఉండటం అనే 3 మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ సీఎస్‌హోదాలో సొంత జిల్లా మొదటిసారి వచ్చిన జవహర్‌రెడ్డి తన సొంత గ్రామం,గుడి,చదువుకున్న పాఠశాలను దర్శించడం సంతోషకరంగా ఉన్నారు. కోవిడ్ సమయంలో ఆయన రాష్ట్రంలో ఎన్నో సేవలందించారని పేర్కొన్నారు.

ముద్దనూరుతో ఎన్నో అనుభవాలున్నాయి

తన బాల్యం అంతా ముద్దనూరులోనే గడిచిందని, తన తండ్రి ఈశ్వరరెడ్డి హిందీ పండిట్‌గా పనిచేస్తుండడంతో తాను 1నుంచి 8వ తరగతి వరకు ఇక్కడే విద్యాభ్యాసం చేశానని ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి గుర్తుతెచ్చుకున్నారు. గతంలో తాను చదువుకున్న తరగతి గదిలో కూర్చుని మురిసిపోయారు. గతంలో తాను ముద్దనూరును దత్తగ్రామంగా స్వీకరించి అభివృద్ధి పనులు చేపట్టానని,పాఠశాల అభివృద్ధికి కృషిచేశానని ప్రభుత్వ సీఎస్ గతాన్ని గుర్తుచేసుకున్నారు.అంతకుముందు ఆయన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్నేహితుడు డాక్టర్ బాలనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన భార్య నాగమల్లమ్మతో మట్లాడారు. చివరగా సహ విద్యార్థి నారాయణరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్, మున్సిపల్ కమిషనర్ ఎస్ ఎస్ ప్రవీణ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి, చిత్రంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

న్యూస్‌రీల్

చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: చిరుధాన్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణంరాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో ఖరీఫ్ సాగు ప్రణాళికపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని సిబ్బంది కూడా వారి యూనిట్ పరిధిలోని రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకరావడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు కిచెన్ గార్డెన్‌పైన అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వారం పొలంబడి నిర్వహిస్తూ, రైతులతో మమేకమై పనిచేయాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌నాయక్, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి తెలిపారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మొదటి శుక్రవారం ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. మొదట వచ్చిన చిన్న ఉద్యోగమైనా చేరి తర్వాత అంచెలంచెలుగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాకు 310 మంది అభ్యర్థులు రాగా, అందులో 135 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ కె.రత్నరాజు, ఏపీఎస్ ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ నాగార్జున, సి.డ్యాప్ జేడీ ఎం వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి రూ.85 కోట్లు

కడప కల్చరల్ : జిల్లాలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు చేసిందని ఆ శాఖ కమిషనర్ ఎం.హరి జవహర్‌లాల్ తెలిపారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో ఇప్పటికి 187 దేవాలయాల కోసం కామన్ గుడ్ ఫండ్ (సర్వశ్రేయో నిధి) ద్వారా రూ. 85 కోట్లను మంజూరు చేశామన్నారు. ఈ పథకంలోని ఆలయాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, సంవత్సరంలోపు పనులు పూర్తవుతాయని తెలిపారు. పేద బ్రాహ్మణులు అర్చకత్వం చేస్తున్న తక్కువ ఆదాయం గల దేవాలయాలలో నిత్య ధూప దీప నైవేద్యం కింద జిల్లాలో 511 మంది అర్చకులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మంజూరు అయ్యాయని తెలిపారు. దీని ద్వారా జిల్లాలో హిందూ ధర్మాన్ని పెంచేందుకు దేవాలయ వ్యవస్థను పటిష్టం చేసినట్లవుతుందన్నారు. భానుకోట శ్రీ సోమేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీ గొప్పగా తీర్చిదిద్దిందని హరి జవహర్‌లాల్ తెలిపారు. భవిష్యత్తులో ఈ ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని, భక్తుల సౌకర్యం కోసం ఈ క్షేత్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ క్షేత్రంలో అవసరమైన డార్మెటరీ, అర్చకుల వసతి గృహాలు, భక్తుల సౌకర్యం కోసం స్నానపు గదులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అధికారుల పరిశీలన

పోరుమామిళ్ల: ప్రభుత్వ పథకాలు అమలుతీరుపై, లబ్ధిదారుల అభిప్రాయం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు శుక్రవారం ఢిల్లీ జాతీయస్థాయి మానిటరింగ్ బృందం అధికారులు సత్యబ్రత బేహారా, శిశిర్ సాహు మండలంలోని పుల్లివీడు పంచాయతీని సందర్శించారు. వారి వెంట డ్వామా అడిషనల్ పీడీ శివప్రసాద్, ఏపీడీలు శ్రీనివాస్, ఆనంద్, ఏపీయం అశోక్‌రెడ్డి, ఏఈలు బాలసుబ్రమణ్యం, రమేష్ బాబు, ఎంపీడీఓ నూర్జహాన్, ఉపాధి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఐ విచారణ కోరింది మేమే

- నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులెవరో నిగ్గుతేల్చాలి
- వైఎస్ అవినాష్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు



మాట్లాడుతున్న సురేష్ బాబు

కడప కార్పొరేషన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసులో మొదట సీబీఐ విచారణ కోరింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. కడపలోని అపూర్వ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. విచారణ చేయాల్సినవారిని చేయకుండా వైఎస్ కుటుంబ సభ్యులను ఇరికించాలనే కోణంలోనే సీబీఐ దర్యాప్తు చేస్తోందన్నారు. వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు అప్పటి ఇంటెలిజెన్స్ ఐజీ వెంకటేశ్వరరావు ఈ కేసును తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించారని గుర్తు చేశారు. సీబీఐకి భయపడి హస్తినకు పారిపోయారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటం, లోకేష్ పాదయాత్రకు స్పందన లేకపోవడం వంటి కారణాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని పత్రికలు వారి దుష్ప్రచారానికి వంత పాడుతున్నాయని మండిపడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీబీఐ విచారణ జరగకుండా స్టే తెచ్చుకున్నదెవరో అందరికీ తెలుసునన్నారు. వైఎస్ అవినాష్‌రెడ్డిని సీబీఐ సాక్షిగా మాత్రమే విచారణకు పిలిచిందని, ఆయన కడిగిన ముత్యంలా ఈ కేసునుంచి బయటపడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా విచారణ చేయాలని మాత్రమే తాము సీబీఐని కోరుతున్నామన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన వైఎస్సార్‌సీపీ బలం తగ్గుతోందనుకోవడం వారి భ్రమేనన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేసినా తమ పార్టీ లెక్కచేయలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంటూ టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదని, అలా చేశారనడానికి గల ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఉనికిని కాపాడుకోవడానికే టీడీపీ నాయకులు తంటాలు పడుతున్నారన్నారు. సొంత కుటుంబంలోని వారిని చంపుకునే వ్యక్తిత్వం వైఎస్ కుటుంబీలకు లేదని.. వారు కక్షలు, కార్పణ్యాలకు పాల్పడరనే విషయం జిల్లా ప్రజలకు తెలుసునని సురేష్‌బాబు అన్నారు. తన తండ్రి రాజారెడ్డిని చంపిన వారినే వైఎస్ఆర్ క్షమించి వదిలేశారని గుర్తు చేశారు. వైఎస్ కుటుంబ సభ్యులపై బురదజల్లాలనుకుంటే అది టీడీపీ నాయకులపైనే పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీపీ చైర్మన్ మాధవరెడ్డి, కార్పొరేటర్లు ఎం.సుబ్బారెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, వేణుగోపాల్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్‌పీఎల్ చాంపియన్‌గా ఎస్.కె.ఎస్.సి జట్టు

- సీనియర్ విభాగంలో ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల విజయం
- జూనియర్ విభాగంలో ఆర్.కె. వ్యాలీ ట్రిపుల్‌ఐటీ
- వచ్చే సీజన్ ఫైనల్స్ ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో: సీఏవైడీ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి
- విజేతలకు ట్రోఫీల బహూకరణ



మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ చాంపియన్‌లుగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. జూనియర్ విభాగంలో ఇడుపులపాయ ఆర్.కె. వ్యాలీ ట్రిపుల్‌ఐటీ జట్టు విజయం సాధించింది. శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని కేఎస్ఆర్ఎం క్రీడామైదానంలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసేందుకు సాక్షి యాజమాన్యం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లలో పాల్గొనడం ద్వారా ఉన్నతశ్రేణి క్రికెట్ ఆడేందుకు అనుభవం వస్తుందన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లాలో క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరెక్కడా లేని విధంగా క్రికెట్ మైదానాలు మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా రూ.6 కోట్లతో వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో ఫ్లడ్‌లైట్లు నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో టాలెంట్‌హంట్ నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి ప్రీమియర్ లీగ్ వచ్చే సీజన్‌లో ఫైనల్‌కు వచ్చే క్రీడాకారులకు వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో ఆడే అవకాశం కల్పిస్తామని తెలిపారు. క్రీడాకారులకు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ముఖ్యమని సూచించారు. సీఏవైడీ జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. సీఏవైడీ కోశాధికారి మహేంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు. సాక్షి యూనిట్ మేనేజర్ సి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీలు విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన కళాశాలల యాజమాన్యాలు, క్రికెట్ సంఘం ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్‌కు అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్. మునికుమార్‌రెడ్డి, రెహమాన్, సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్. ముజీబుద్దీన్, అడ్వర్‌టైజ్‌మెంట్ రీజినల్ మేనేజర్ డి.సుబ్బారెడ్డి, సర్క్యులేషన్ ఏజీఎం ప్రతాప్‌రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ చాముండేశ్వరి, బ్యూరో ఇన్‌చార్జి ఎం.బాలకృష్ణారెడ్డి, స్టాఫ్‌రిపోర్టర్ బి.వి. నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతల వివరాలు

సీనియర్ విభాగం: ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు (విన్నర్స్), ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప (రన్నర్స్)

జూనియర్ విభాగం: ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్‌ఐటీ, ఇడుపులపాయ (విన్నర్స్), ఎస్.ఆర్.ఐ.టి. కళాశాల, ప్రొద్దుటూరు (రన్నర్స్)



సీనియర్ విభాగం చాంపియన్‌లుగా నిలిచిన ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. కళాశాల జట్టు



సీనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఎస్.వి. డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో చాంపియన్‌లుగా నిలిచిన ఇడుపులపాయ ఆర్.కె. వ్యాలీ ట్రిపుల్‌ఐటీ జట్టు



జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐ.టి. కళాశాల జట్టు

క్లుప్తంగా

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ ఆధ్వర్యంలో ఓపీఎస్ సాధన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రఘునాథ రెడ్డి, బాలగంగిరెడ్డి, అబ్దుల్‌వాజీద్, సుబ్రమణ్యం రాజు, ఇలియాస్‌బాషా, చంద్రశేఖర్, నాగరాజు, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం, నంద్యాల, శ్రీసత్యసా యి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులలోపాటు నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అగ్రికల్చర్ : కడపలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు లోకేశ్వరెడ్డి(డీఈఈ), శ్రీనివాసులు(ఏజీ మైన్స్) శుక్రవారం కడప వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేపట్టారు. దేవునికడప రోడ్డు జయశంకర్ పెస్టిసైడ్ అండ్ ఫర్టిలైజర్స్‌లో రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌కు, గోడౌన్‌లో ఉన్న స్టాక్‌కు తేడాలు ఉన్న రూ. 10,11,150 విలువ చేసే 36.75 టన్నుల డీఏపీ, 15.15.15.09 ఎరువులు, పాతబస్టాండ్‌లోని రైతు డిపోలో రూ.3,46,600 విలువ చేసే 13.35 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్, 20.20.0.13 రకానికి చెందిన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు.

ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరు

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP



కేఎస్ఆర్ఎం మైదానంలో ఎస్.కె.ఎస్.సి, ఎస్.వి.డిగ్రీ కళాశాలల జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

కడప స్పోర్ట్స్ : సాక్షి ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఫైనల్ పోరు ఉత్కంఠగా సాగింది. శుక్రవారం కడప నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో సీనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల జట్టు, కడప ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్.కె.ఎస్.సి.జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. జట్టులోని యేసన్న 30 పరుగులు చేశాడు. ఎస్.కె.ఎస్.సి.బౌలర్ దేవేంద్ర 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.కె.ఎస్.సి.జట్టు 14 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులోని శివ కేశవ 38 బంతుల్లో 50 పరుగులతో రాణించాడు. దీంతో ఎస్.కె.ఎస్.సి.డిగ్రీ కళాశాల జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది.

- కాగా అంతకు మునుపు కేఎస్ఆర్ఎం మైదానంలో ఉదయం నిర్వహించిన సెమీఫైనల్–1లో బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల జట్టుపై ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.
- కేఓఆర్ఎం మైదానంలో ఉదయం నిర్వహించిన సెమీఫైనల్–2లో ఎస్.వి.డిగ్రీ కళాశాల జట్టు కేఎస్ఆర్ఎం కళాశాల జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

అదరగొట్టిన ఆర్.కె.వ్యాలీ జట్టు

జూనియర్ విభాగంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఇడుపులపాయ ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీ జట్టు, ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐ.టి జట్లు తలపడ్డాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన ఫైనల్‌మ్యాచ్‌లో టాస్ గెలిచిన ట్రిపుల్ ఐటీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని ఎస్.కె.ఇర్ఫాన్ 28 పరుగులు, వి.మధు 23 పరుగులు చేశారు. ఎస్.ఆర్.ఐ.టి బౌలర్ నిరంజన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్.ఆర్.ఐటీ జట్టు 8.2 ఓవర్లలో 51 పరుగులకే ఆలౌట్ అయింది. ట్రిపుల్ ఐటీ బౌలర్లు చిన్న వెంకటేష్ 4, గంగాధర్ 3 వికెట్లు తీశారు. దీంతో ఆర్.కె.వ్యాలీ ట్రిపుల్ ఐటీ జట్టు 105 పరుగుల తేడాతో విజయం సాధించింది.



మ్యాచ్ నిర్వహిస్తున్న అంపైర్లు

సీమ రైతుకు కావ్య గౌరవం కల్పించిన 'భైరపురెడ్డి'



భైరపురెడ్డి రెడ్డినారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : రాయలసీమ రైతుల కన్నీటిగాథను కరుణాత్మక కావ్యంగా రైతు కవి భైరపురెడ్డి రెడ్డి నారాయణ మలిచారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఏర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం రైతు కవి భైరపురెడ్డి రెడ్డినారాయణరెడ్డి 101 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రెడ్డి నారాయణరెడ్డి రాయచోటి సమీపంలోని రెడ్డివారిపల్లెకు చెందిన వారని తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన మూడు పద్యకావ్యాలు రాశారని, కానీ 1952లో సీమలో వచ్చిన కరువు అనుభవంతో రాయలసీమ రైతు పేరిట కావ్యం రాశారన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ రెడ్డినారాయణరెడ్డి కావ్యాలకు తగినంతగా గుర్తింపు రాకపోవడం బాధాకరమన్నారు. గ్రంథ పాలకులు రమేష్‌రావు మాట్లాడుతూ తక్కువ చదువుకున్న రెడ్డి నారాయణరెడ్డి కవిగా సాహితీ జగత్తులో గుర్తింపు సాధించారన్నారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ హజరతయ్య, బ్రౌన్ కేంద్రం జూనియర్ అసిస్టెంట్ వెంకట రమణ, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకం.. లాభదాయకం



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం మురళీకృష్ణ

కడప అగ్రికల్చర్ : పుట్ట గొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పాల పుట్టగొడుగులు, ముత్యపు పుట్టగొడుగుల పెంపకంపై సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఇలాంటి ఉపాధి కల్పించే శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అనంతరం శిక్షణ తీసుకున్న రైతులకు సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

శనగలో ఎస్‌బీఈజీ– 452 రకంతో అధిక దిగుబడి

శనగ పంటకు సంబంధించి ఎస్‌బీఈజీ– 452 రకం విత్తనంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన ద్వారా శనగలో ఎస్‌బీఈజీ– 452 విత్తన రకాన్ని రైతులతో సాగు చేయించి శిక్షణతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా పెండ్లిమర్రి మండలం చెన్నంరాజుపల్లె గ్రామంలోని చెన్నారెడ్డి పొలంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మురళీకృష్ణ, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రమాదేవి, శాస్త్రవేత్తలు మహేష్ బాబు, సాయి మహేశ్వరి, జయలక్ష్మి, రాయలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

– భార్య మృతి, భర్తకు గాయాలు

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని సోగాల్‌పల్లె గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడటంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం.నాగజ్యోతి(30) భర్త మల్లికార్జునతో కలిసి ఆటోలో వేంపల్లెకు వెళ్తోంది. సోగాల్‌పల్లె వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఆమె తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జునకు గాయాలు అయ్యాయి. వారికి ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



రామకృష్ణ (ఫైల్)

చింతకొమ్మదిన్నె : అప్పుల బాధతో 2013 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బోనాసి రామకృష్ణ (31) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సికెదిన్నె ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఊటుకూరు పంచాయతీ పరిధి విశ్వనాథపురంలోని ప్రొఫెసర్స్ కాలనీలో ఏఆర్ కానిస్టేబుల్ బోనాసి రామకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉండేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇంటిలో అందరూ నిద్రిస్తుండగా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అధిక మొత్తంలో అప్పులు చేసి తీర్చలేక, వాటి బాధ తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బావిలోకి దూకి వృద్ధురాలు..



మృతి చెందిన సరస్వతి

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నెకు చెందిన గజ్జల సరస్వతి (70) అనే వృద్ధురాలు శుక్రవారం పాడుపడ్డ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గజ్జల సరస్వతి సీకేదిన్నెలో నివసిస్తుండే వారు. ఈమె పిల్లలు ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉన్నారు. కొన్నేళ్లుగా క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ బాధపడేది. ఈ వ్యాధితో తీవ్ర మనస్తాపానికి గురై సీకేదిన్నె సమీపాన వ్యవసాయ పొలాల్లోని పాడు బడ్డ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న శనేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సిద్దవటం మండలంలోని వాసవీ ఫార్మసిస్టు కళాశాలకు చెందిన మెటీరియల్‌ను కడప రిమ్స్ నుంచి ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కడపకు చెందిన మోహన్, ఆటో డ్రైవర్ అల్లాబకష్‌కు గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

మహిళ అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాగితాలపెంటలో నివాసం వుంటున్న షేక్ ఖాజావల్లీ తన కుమార్తె షేక్ షబానా (36) ఈ నెల 2వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ తాహీర్‌హుసేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలోని రైల్వేకొండాపురానికి చెందిన మొఘల్ మహమ్మద్ ఇస్మాయిల్‌తో, షేక్ షబానాకు 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. ఇటీవల కొంత కాలంగా వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తన పుట్టింటిలోనే కొంత కాలంగా వుంటోంది. కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో గతంలో కేసు నమోదై వుంది. ఆ కేసు విచారణ కొనసాగుతోంది. ఈక్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇరువురికి రాజీ కుదిర్చారు. ఈ నేపథ్యంలో ఆమె ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదని, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తండ్రి తెలియజేశారు.

విలేకరిపై కాల్పులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన పర్వతరెడ్డి అనే విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పర్వతరెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగు చూసింది. అర్బన్ సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 31న సాయంత్రం పర్వతరెడ్డి చిత్తూరు రోడ్డు వైపు నుంచి ద్విచక్రవాహనంపై పట్టణంలోకి వస్తుండగా శివాలయం చెక్‌పోస్టు సమీపానికి రాగానే కాల్పులు జరిగినట్లు తెలిపారు. అయితే విలేకరి మాత్రం తనకు వాహనాల టైర్ల కింద నుంచి ఏదైనా రాయి వచ్చి గుచ్చుకొందని భావించి, అదే రోజు కడపలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొన్నాడు. శరీరం లోపల బుల్లెట్ ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఆస్తి తగాదాల కారణంగానే ఇలా జరిగింటుందనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశాడు.

నిందితులను పట్టుకొని శిక్షిస్తాం : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నిందితులను త్వరగా పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాయచోటి జర్నలిస్టుల సంఘం నాయకులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

మహిమ కోసం మరియతల్లిని ఆహ్వానిద్దాం



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్) దైవ సందేశం అందజేస్తున్న పాదర్ సుసై నాదన్

కడప కల్చరల్ : మరియతల్లి నడయాడిన ప్రాంతమంతా పావనమవుతుందని, మన జీవితంలో మహిమలు జరిగేందుకు మరియతల్లిని ఆహ్వానిద్దామని టేకూరుపేట విచారణ గురువులు పాదర్ ముళ్లపాటి వరప్రసాద్ అన్నారు. కడప నగరం మరియాపురం పాత చర్చి ఆవరణలో లూర్దుమాత తిరునాల రెండవ రోజున జరిగిన ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత రేణిగుంట విచారణ గురువులు సుసై నాదన్ వేదికపై దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం పాదర్ వరప్రసాద్ ప్రధాన ప్రసంగం చేస్తూ మరియతల్లి పాదం మహిమాన్వితమని, ఆమె కాలు మోపిన కుటుంబాలలో ఆశీర్వాదాలు, గౌరవ మర్యాదలు లభించి జన్మ సార్థకమవుతుందన్నారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై లూర్దుమాత ప్రతిమను ఉంచి మరియాపురం వీధుల్లో పరిశుద్ధ గీతాలాపనలతో పలువురు గురువుల జపాలతో ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు తీసుకు వచ్చారు. ప్రార్థనలనంతరం ఆధ్యాత్మిక సభను ప్రారంభించారు. దివ్య సందేశం అనంతరం స్థానిక కారుణ్య సంఘం ప్రతినిధులు బలిపీఠం అలంకరణ నిర్వహించారు. కోయర్ బృందాలు స్తుతి గీతాలను ఆలపించారు. విచారణ గురువులు బిరుసు రాజా, కె.చంద్ర ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. తిరునాల కమిటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

దుంగలు, వాహనంతో సహా
రూ.7.13 లక్షల సామగ్రి స్వాధీనం



నిందితులు, దుంగలను చూపుతున్న ఎస్ఐ

కలికిరి : ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దుంగలు, వాహనంతో సహా రూ.7.13 లక్షల సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేష్‌రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా నిందితులను హాజరు పరిచి, దుంగలను చూపించారు. మండల పరిధిలోని మేడికుర్తి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా.. కలకడ వైపు నుంచి ద్విచక్రవాహనం, కారు వేగంగా రావడం, ఆపకుండా వెళ్లడంతో పోలీసులు అటకాయించి పట్టుకున్నారు. ద్విచక్రవాహనంలో ఇద్దరు, కారులో వస్తున్న ఎనిమిది మంది వాహనాలను వదిలి పారిపోతుండగా.. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు పారిపోయారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లాకు చెందిన మణి, పోలూరు తాలుకాకు చెందిన అన్బు, కొడుమాంపల్లికి చెందిన మణిబాబు, కన్నూర్ గ్రామానికి చెందిన శేఖర, చిన్నసేలం తాలుకాకు చెందిన కుల్లన్ కుమార్, జమనమత్తూర్ తాలూకాకు చెందిన భాగ్యరాజ్ మరో నలుగురు కూలీలతో కలిసి సుండుపల్లి వద్ద శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికి దుంగలను అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నించారు. వారిలో మణిబాబు, భాగ్యరాజ్, కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలు, కారు, ద్విచక్రవాహనం, మూడు మొబైల్ ఫోన్‌లు, ఇనుప గొడ్డళ్లు మొత్తం రూ.7,13,700 విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వారందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన వాల్మీకిపురం ఇన్‌చార్జి సీఐ నాగేంద్ర, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, ఏఎస్ఐలు మధుసూదనాచారి, మాబుసాబ్, హెడ్‌కానిస్టేబుళ్లు మనోహర్, రాజేంద్ర, రఫీ, కానిస్టేబుళ్లు చైతన్య, అమరనాథ్, జిలానీ, వెంకటసిద్దు, సుబ్రమణ్యం, హోంగార్డులు నిజాముద్దీన్, రఫీలను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

గుర్తుకొస్తున్నాయి.. ఆనాటి మధుర జ్ఞాపకాలు

- మరుపురాని సీతామాలక్ష్మి
- కురబలకోటతో కె.విశ్వనాథ్‌కు వీడదీయరాని అనుబంధం



కురబలకోట రైల్వేస్టేషన్‌లో సీతామాలక్ష్మి సినిమా సన్నివేశం (ఫైల్)

కురబలకోట : అపురూప చిత్రాల దర్శకులు, సృజన శీలి కె.విశ్వనాథ్‌కు అన్నమయ్య జిల్లా కురబలకోటతో మరుపురాని అనుబంధం ఉంది. ఆయన దర్శకత్వంలో సీతామాలక్ష్మి సినిమా తీశారు. మండలంలో తొలి సినీ షూటింగ్ కూడా ఇదే. నెల పాటు షూటింగ్ నిర్వహించారు. చంద్రమోహన్, తాళ్లూరి రామేశ్వరి హీరోహీరోయిన్లుగా నటించారు. సినీ షూటింగ్ ఎలా ఉంటుందో చూడటానికి జనం తరలి వచ్చారు. ఆ తర్వాత ఎన్నో ఈ చిత్రాలకు ఆద్యమైంది. 1978 జూలై 27న రిలీజ్ అయ్యింది. సూపర్ హిట్. చిన్న సినిమాగా రిలీజై పెద్ద పేరు తెచ్చుకుంది. మండలంలోని తెట్టు, కురబలకోట రైల్వేస్టేషన్‌లో పలు సన్నివేశాలు తీశారు. ఈ సినిమా ఆయన కేరీర్‌కు నిచ్చెనలా మారింది. మరో వైపు హీరోగా చంద్రమోహన్ కేరీర్‌కు కూడా దోహదపడింది. తాళ్లూరి రామేశ్వరికి హీరోయిన్‌గా తొలి చిత్రమిది. ఉత్తమ నటిగా నంది అవార్డు అందుకున్నారు. ఈ సినిమాను తమిళం, హిందీలో తీశారు. ఇప్పటికీ కురబలకోట రైల్వే స్టేషన్‌ను సీతామాలక్ష్మి స్టేషన్‌గా పిలుస్తుంటారు. కె.విశ్వనాథ్ మృతితో మండల వాసులు సీతామాలక్ష్మి సినిమా షూటింగ్ నాటి సంగతులను గుర్తు చేసుకుంటున్నారు.

మదనపల్లె అంటే విశ్వనాథుడికి ఎంతో ఇష్టం

మదనపల్లె సిటీ : కళాతపస్వి, సినీ దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు మదనపల్లె అంటే ఎంతో ఇష్టం. ఆయన తన సన్నిహితులతో తరచూ చెప్పేవారు. భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు రొమ్మాల మునికృష్ణారెడ్డికి విశ్వనాథ్‌తో సాన్నిహిత్యం ఉంది. ఈ నేపథ్యంలో 1990 ఏప్రిల్ 1న మదనపల్లెకు ఓ పాఠశాల వార్షికోత్సవానికి వచ్చారు. సిరిమువ్వల సింహనాదం సినిమా కథ నాయకులు కళాకృష్ణ, మాధవిలతో కలిసి విచ్చేశారు. పిల్లలకు సామాజిక విలువల గురించి తెలియజేశారు. రెండు రోజుల పాటు మదనపల్లెలోనే బస చేశారు. విశ్వనాథ్‌తో తనకున్న పరిచయం గురించి చైతన్యభారతి పాఠశాల కరస్పాండెంట్ సంపత్‌కుమార్ తెలియజేశారు. పలు సార్లు విశ్వనాథ్‌ను కలిసినట్లు తెలిపారు. ఆయన మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సీతామలక్ష్మి సినిమా చిత్రీకరణ కోసం దర్శకులు విశ్వనాథ్ కురబలకోట మండలం తెట్టు గ్రామానికి వచ్చినట్లు మదనపల్లెకు చెందిన జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు తెలిపారు. తమ ఇంటిలోనే బస చేశారని ఆయన గుర్తు చేసుకున్నారు.